క్లుప్తంగా

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

వేటపాలెం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జాం డ్రపేట గంగా భ్రమరాంబ సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ డైరెక్టర్ ఆర్కే నల్లూరి హాజరై మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం చేస్తున్న క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో క్లబ్‌కి అవసమైన సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బట్టా మోహన్‌రావు, కార్యదర్శి ఏవీ సురేష్ బాబు, కాలేశ్వరరావు, సీతారామయ్య, సత్రం రోహిణీ కుమార్ పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

మార్టూరు: అదనపు కట్నం కోసం వేధింపులకు గురవుతున్న ఓ యువతి ఫిర్యాదుపై మంగళవారం కేసు నమోదైంది. ఏఎస్సై సైదా వివరాల మేరకు.. మార్టూరు బలరాం కాలనీకి చెందిన బాపట్ల శ్రీదేవి, బాపట్ల శివనాగాంజనేయులు భార్యాభర్తలు. వీరికి సుమారు 15 సంవత్సరాల క్రితం వివాహం కాగా ఇద్దరు సంతానం. గత కొంతకాలంగా శ్రీదేవిని అదనపు కట్నం తీసుకు రావాలంటూ భర్త శివనాగాంజనేయులు, తల్లి కుటుంబ సభ్యులతో కలిసి శారీరకంగా, మానసికంగా వేధించసాగారు. ఈ క్రమంలో మంగళవారం కుటుంబ సభ్యులు కలిసి శ్రీదేవిపై బంధువులతో కలిసి దాడి చేశారు. ఈ క్రమంలో పోలీసులను ఆశ్రయించిన శ్రీదేవి ఫిర్యాదుపై శివనాగాంజనేయులు అతని తల్లి బాపట్ల ఆదెమ్మ, ఇతర కుటుంబ సభ్యులు చీరాల మాధవి, వెంపదాల గోపీలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

గ్రంథాలయాలతో ఎన్నో ఉపయోగాలు


గ్రంథాలయంలో పిల్లలకు నీతి కథలు బోధిస్తున్న లైబ్రేరియన్ ధనమ్మ

చీరాల అర్బన్: వేసవిలో నిర్వహించే గ్రంథాలయాలతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చీరాల శాఖ లైబ్రేరియన్ డీ ధనమ్మ పేర్కొన్నారు. మంగళవారం వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులతో నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, విజ్ఞాన పుస్తకాలు మొదలైనవి చదివించారు. అనంతరం పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసే క్రమంలో అంత్యాక్షరి ఆటను పిల్లలతో ఆడించారు. కార్యక్రమానికి మొత్తం 19 మంది విద్యార్థులు హాజరయ్యారని లైబ్రేరియన్ ధనమ్మ తెలిపారు.

శింగరకొండ దర్శిని


అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, శ్రవణం నక్షత్రం, షష్టి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

పాఠశాల తెరిచే రోజుకి పాఠ్య పుస్తకాలు

బల్లికురవ: ప్రభుత్వ పాఠశాలలు తెరిచే రోజు జూన్ 12 నాటికి పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక కిట్లు పంపిణీ చేసేందుకు కసరత్తు జరుగుతోందని ఎంఈవో-2 రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రాల నుంచి ఎమ్మార్సీ కార్యాలయాలకు ఈవారంలో పాఠశాలల వారీగా విద్యార్థులకు కావాల్సిన ఇండెంట్ ప్రకారం చేర్చేందుకు జాబితా సిద్ధం చేశామన్నారు. ఎమ్మార్సీ కార్యాలయాల్లో మెటీరియల్ నిల్వ చేసేందుకు సిద్ధం చేశామని ఎంఈఓ వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభజ్ఞులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఒత్తిడి లేని విద్యను అందిస్తారని పేర్కొన్నారు. బడిఈడు కలిగిన బాలబాలికలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు.

కౌలు.. వేలల్లో దౌడు

- నియోజకవర్గంలో ఎకరా కౌలు రూ.50 వేలు
- జిల్లాలో ఎక్కడా ఇంతటి కౌలు ధరలు లేవు
- ఆకాశాన్నంటుతున్న కౌలు ధరలు
- కౌలు రైతులను ఆదుకున్న సీఎం జగన్


కారంచేడు ప్రాంతంలో సాగు చేసిన మిరప (ఫైల్)


ఆదిపూడి ప్రాంతంలో సాగు చేసిన శనగ (ఫైల్)

కారంచేడు: ఈఏడాది నైరుతి రుతుపవనాలు త్వరగా వస్తాయంటున్న నేపథ్యంలో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాని భూమిని కౌలుకు తీసుకుని సాగుచేసే రైతులు మాత్రం బాధపడుతున్నారు. భూయజమానులు కౌలు ధరలు అమాంతం పెంచేశారు. జిల్లా ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు ప్రాంతంలోని పంట భూముల కౌలు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కౌలు ధరలు ఎగిసిపడటానికి రైతుల్లో నెలకొన్న పోటీనే అని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో సాగుకు అనుకూలమైన వాతావరణం లేక ఈ ప్రాంతంలోని సాగు భూములు ఒక్కో ఏడాది బంజరు భూములుగా మారాయి. ప్రతి ఏటా ఈ ప్రాంత భూముల్లో ఏ పంట సాగు చేసినా రైతులు బంగారం పండించేవారు. మాగాణి ప్రాంతంగా పేరొందిన కారంచేడులో గత రెండు, మూడు సంవత్సరాలుగా మెట్ట పైర్లకు కూడా అన్నదాతలు ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో కేవలం మిరపపంట సాగుకు మాత్రమే కౌలు ధరలు ఎక్కువగా ఉండేవి. ప్రస్తుతం కౌలు రైతులు ఏ పంట సాగు చేసుకున్నా ఎకరా కౌలు మాత్రం రూ.40-50 వేల వరకు డిమాండ్‌గా ఉంది. గతేడాది మాగాణి సాగు కంటే మెట్టపైర్ల సాగుకే ఎక్కువగా రైతులు ఆసక్తి చూపారు. కాని మళ్లీ ఈ ఏడాది వరి సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. కారణం గతేడాది మెట్టపైర్లతో పాటు వరికి కూడా మంచి మద్దతు ధరలు, గిట్టుబాటు ధరలు ఉండటమేనని రైతులు చెప్తున్నారు. కౌలు ధరలకు రెక్కలు రావడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం అవుతున్నాయి. చిన్న, సన్నకారు రైతులు మాత్రం ఈ కౌళ్ల ధరలకు బెంబేలెత్తుతున్నారు.

అపరాల ధరలు ఆకాశన్నంటడమే..

గతంలో ఎన్నడూ లేని విధంగా అపరాల ధరలకు మంచి గిట్టుబాటు ధరలు వచ్చాయి. ఒక రకంగా రైతులు ఆశించినదాని కంటే మంచి ధరలు పలికాయి. దీంతో మెట్ట పైర్ల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ ప్రాంతంలో మాగాణి భూముల్లో సైతం మెట్ట పైర్లు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో మాదిరిగా సాగుకు నీరు పెద్దగా లేకపోయినా మెట్ట పైర్లు సాగు చేసుకోవచ్చనే ధైర్యంతో రైతులు కౌలుకు ఎగబడుతున్నారు. దీంతో ధరలు కూడా రెట్టింపయ్యాయి. ఈదశలో పెద్ద రైతులు కౌలు ఎక్కువగా వస్తుందని ఆనందం వ్యక్తం చేస్తుంటే సన్న, చిన్నకారు రైతులు మాత్రం ఇంత కౌలు చెల్లించేందుకు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు పెట్టుబడులు సైతం ఈ సంవత్సరం గత ఏడాదితో పోల్చుకుంటే విపరీతంగా పెరుగుతాయని రైతులు చెప్తున్నారు. మిరప సాగుకు ఎకరానికి రూ 2.0-2.50 లక్షలు, శనగ సాగుకు ఎకరానికి రూ.25-30 వేలు, మాగాణి సాగుకు ఎకరాని రూ.25-30 వేలు వరకు ఖర్చు చేసినట్లు రైతులు చెప్తున్నారు.

ఎకరం భూమి కౌలు ధరలు ఈ విధంగా..		
మిరప	2023లో	రూ.30-40 వేలు
	2024లో	రూ.40-50 వేలు
శనగ	2023లో	రూ.30-35 వేలు
	2024లో	రూ.40-50 వేలు
పొగాకు	2023లో	రూ.30-40 వేలు
	2024లో	రూ.40-50 వేలు

కౌలు రైతులను ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం..

భూ ఉన్న రైతులకు రైతుభరోసా అందించడమే కాకుండా కౌలు రైతులకు కూడా ప్రభుత్వం రైతు భరోసా అందిస్తోంది. ఏటా వీరికి రూ.13500 నేరుగా వారి ఖాతాల్లోనే జమచేసి ఆదుకుంది. అంతేకాకుండా ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం, యంత్రాల పంపిణీ, విత్తనాలు, పురుగుమందులు తదితర పథకాలను అందించి వారికి వెన్నుదన్నుగా నిలిచింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల పక్షపాతి నిరూపించుకున్నాడని కౌలు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఇన్‌పుట్ సబ్సిడీ ఆదుకుంటోంది..



ప్రస్తుతం అన్నదాతలు, కౌలు రైతులు చాలా రకాల ఒత్తిళ్లతో కూడిన వ్యవసాయం చేస్తున్నారు. వేలకు వేలు పెట్టుబడులు, కౌలు ధరలు చెల్లించి సాగు చేస్తే ప్రకృతి ప్రకోపానికి గురవ్వాల్సి వస్తోంది. సీఎం జగనన్న పాలనలో పంటలు నష్టపోయినా ఇన్‌పుట్ సబ్సిడీలు, పంట నష్ట పరిహారాలు సకాలంలో అందుతున్నాయి. మాలాంటి సన్న, చిన్నకారు రైతులు పెద్దగా నష్టపోకుండా ఆదుకుంటున్నారు.

–పశ్యా రామకృష్ణ, కౌలు రైతు, కారంచేడు

గతంలో ఇంత ధరలు ఎప్పుడూ చూడలేదు..



గతంతో పోల్చుకుంటే సాగు భూములకు కౌలు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. నేను గత 20 సంవత్సరాలకు పైగా వ్యవసాయం చేస్తున్నాను. మిరప, పొగాకు, శనగలు సాగు చేసేదానిని. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది కౌలు ధరలు పెరిగాయి. ప్రతి ఏడాది ఎంతో కొంత కౌలు ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పెరిగిన ధరలకు తగినట్లుగా ముందుకు వెళ్లక తప్పడం లేదు.

– అంజమ్మ, కౌలు రైతు, ఆదిపూడి

వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దూరం


గంగపాలెంలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి


స్వర్ణలో రుతుక్రమంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ షాలినీ, సిబ్బంది

బల్లికురవ: బాలికలు రక్త హీనతలేకుండా ప్రతిరోజు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ కోరారు. జాతీయ రుతుక్రమం, ఆరోగ్యం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం కొణిదెన, సబ్‌సెంటర్ పరిధిలోని గంగపాలెం గ్రామంలో కిషోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో తీసుకుంటూ ఎప్పటికప్పుడూ రక్తహీనత లేకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కొణిదెన గ్రామంలో 104 శిబిరంలో భాగంగా షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం శిబిరానికి రాలేని వృద్ధుల ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేశారు. కార్యక్రమాల్లో ఏఎన్ఎం నూర్జహాన్, ఎంఎల్‌హెచ్‌పీ కోటేశ్వరరమ్మ ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవాలి..

స్వర్ణ (కారంచేడు): గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లోని బాలికలు, మహిళలు ప్రధానంగా పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రతను కచ్చితంగా పాటించాల్సి ఉందని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలినీ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని స్వర్ణ గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రపంచ రుతుక్రమం ఆరోగ్యం –పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో బాలికలు, మహిళల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు బహిష్టు సమయంలో బాలికలు, మహిళలు చాలా శుభ్రతను పాటించాలన్నారు. 'టు గెదర్ ఫర్ ఏ పీరియడ్ ఫ్రెండ్లీ వరల్డ్' రుతుస్రావం సగటున ప్రతి నెలా 5 రోజులుంటుందన్నారు. అలాగే రుతుచక్రం సగటున 28 రోజులు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, హెచ్ఈఓ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశలు, మహిళలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


క్రీడా దుస్తులు అందజేసిన దాతలతో క్రీడాకారులు

చినగంజాం: గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికి తీసి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడం అభినందనీయం అని రిటైర్డ్ ఆర్అండ్‌బీ ఈఈ కుర్రి రామసుబ్బారావు అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామంలో బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులలోని క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మే 1వ తేదీ నుంచి సుమారు 40 మంది గ్రామీణ క్రీడాకారులు కబడ్డీ, అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. వారికి ఎన్ఐఎస్ కోచ్ కుక్కల అనంతకుమార్ రెడ్డి శిక్షణ ఇస్తున్నారు. క్రీడాకారులకు అవసరమైన క్రీడా దుస్తులను రామసుబ్బారావు, వెంకట కుమారి దంపతులు, రిటైర్డ్ కమర్షియల్ టాక్స్ అధికారి పర్వతరెడ్డి హరిబాబు సులోచన దంపతులు అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బోగిరెడ్డి స్వామిరెడ్డి, కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి, కోచ్ కుక్కల అనంత కుమార్‌రెడ్డి, టీం మేనేజర్ పలపట్ల గోపిచంద్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు సోమయ్య, కొండపి రామారావు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా అద్దంకి నాంచారమ్మ తిరునాళ్లు


తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని అలంకరించిన నిర్వాహకులు


శిడిమాను మహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

- వేలాదిగా తరలి వచ్చిన భక్త జనులు
- ఆకట్టుకున్న శిడిమాను ఉత్సవం

పర్చూరు(చినగంజాం): పర్చూరులో అద్దంకి నాంచారమ్మ అమ్మవారి తిరునాళ్ల కార్యక్రమం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన శిడిమాను మహోత్సవం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఉత్సవంలో యువకులు కేరింతలు కొడుతూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అలజడులు జరగకుండా స్థానిక సీఐ సీతారామయ్య పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వేసవి దృష్టిలో ఉంచుకొని రోగులకు మంగళవారం పండ్లు, రొట్టెలు, మజ్జిగ ప్యాకెట్స్ అందజేశారు. దాత నాగబైరు గాయత్రి ఆర్థిక సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు వీటిని అందజేశారు. ఆసుపత్రి అవసరాలకు తగిన విధంగా ఉచిత మినరల్ వాటర్‌తో పాటు బెడ్ షీట్స్, వైద్యపరీక్షలు నిర్వహించే పరికరాలు అందజేసిన రోటరీ క్లబ్ వారికి డాక్టర్ మస్బుల్ ఆలీ, డాక్టర్ సిద్ధార్థలు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రోటరీ సభ్యులు కోట శ్రీనివాసరావు, పావోలు వెంకన్న, రోటరీ సిబ్బంది అడ్డగడ శివరామకృష్ణ, ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.


పట్టణంలో కార్డన్ సెర్చ్


ప్రజలతో మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు

చీరాల: చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించామని వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఉత్తర్వుల మేరకు మంగళవారం చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హరిప్రసాద్‌నగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటిని సోదా చేశారు. ఇంటి ఆవరణలో పెట్రోలు, డీజిల్, కర్రలు, రాళ్లు ఉన్నాయా అని సోదాలు చేశారు. రౌడీ షీటర్లకు వారి ఇంటి వద్దనే కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజలతో సీఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ముందురోజు, కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలపైనా ఉందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి వివరాలను పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసుల ఉత్తర్వులు ఉల్లంఘిస్తే సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్లు తెరుస్తామన్నారు. అంతేకాకుండా మీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. కౌంటింగ్ నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజకీయ నాయకులు ఎవరైనా ఇబ్బంది పెట్టే కార్యక్రమాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెచ్చగొట్టకుండా సమన్వయంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

ఆమంచిపై చర్యలు తీసుకోవాలి

- డీఎస్పీ ప్రసాద్‌కు ఆమంచి క్షమాపణలు చెప్పాలి
- ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్


సమావేశంలో పాల్గొని నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చీరాల రూరల్: దళిత సామాజిక వర్గానికి చెందిన డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌పై ఆమంచి కృష్ణమోహన్ చేసిన వ్యాఖ్యలపై పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.. డీఎస్పీ ప్రసాద్‌కు ఆమంచి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పి. బోసు మాదిగ మాట్లాడారు. దళిత సామాజిక వర్గానికి చెందిన డీఎస్పీ ప్రసాద్ కింది స్థాయి నుంచి ఎంతో కష్టపడి చదువుకుని అధికారి స్థాయికి చేరుకున్నారని చెప్పారు. ఆయన ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తుంటే ఓర్చుకోలేని ఆమంచి ఆయనను చెట్టుకు కట్టేసి కొడతానని అనడం భావ్యం కాదన్నారు. దళితులన్నా, దళిత అధికారులన్నా ఆమంచికి గిట్టదనే విషయం ఈఘటనతో తేలిపోయిందన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆమంచి దళితులు ఓట్లు వేయకుండా ఎమ్మెల్యే అయ్యాడా అని ప్రశ్నించారు. గతంలో కూడా న్యాయమూర్తులను తన ఇష్టం వచ్చినట్లు మాట్లాడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగ బద్ధంగా పదవులు నిర్వర్తిస్తున్న అధికారులపై ఆయన ఇష్టం వచ్చిన విధంగా పరుష పదజాలంతో మాట్లాడడం తగదన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఆమంచిపై చర్యలు తీసుకోవాలని, డీఎస్పీ ప్రసాద్‌కు ఆమంచి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ముంగర నాగార్జున, దాట్ల సురేష్, బి.అశోక్, డి.డేవిడ్, శ్రీను, పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి


సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే ఆర్పీఎఫ్ సీఐ చంద్రశేఖర్

చీరాల రూరల్: మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్పీఎఫ్ సీఐ టీ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్‌లోని ఆర్పీఎఫ్ స్టేషన్‌లో మానవ అక్రమ రవాణా, స్త్రీ శిశు సంరక్షణపై షాడోస్ సంస్థ, ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇళ్లల్లో అలిగి రైళ్లలో ప్రయాణించే, రైల్వే ప్లాట్‌ఫాంపై ఉండే చిన్నపిల్లలను, మహిళలను గుర్తించే అక్రమార్కులు వారికి మాయమాటలు చెప్పి వారికి డబ్బులు ఆశచూపి ఇతర ప్రదేశాలకు తరలించి వారిని నిలువునా అమ్మేస్తారని చెప్పారు. అటువంటి అక్రమార్కుల మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. షాడోస్ సంస్థ ప్రతినిధి, న్యాయవాది రాజా సాల్మన్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిరోధం, స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం వలన సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడుతుందని, అలానే రైల్వేశాఖ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఆర్పీఎఫ్ ఏఎస్సై రమాదేవి, ఎం. సింగయ్య, ఎస్ఎస్‌పీ. రాహుల్, ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్టుమెంట్ పురుషోత్తం, షాడోస్ సిబ్బంది బి. భాగ్యలక్ష్మి, బి. అలేఖ్య, తదితరులు పాల్గొన్నారు.